# రాక? – పోక?

మనిషి ఈ భూమిపైకి వచ్చేటపుడు కేవలం వట్టి చేతులతోను, వట్టి కాళ్ళతోను వస్తున్నాడు. తన కూడా బంగారు, రత్న, ధనాలు తీసుకొని రావడంలేదు. కాని జీవన భుక్తి కోసం ప్రారంభమైన ఆరాటం దురాశగా మారి ఈ సమస్త ప్రపంచాన్ని తన సొంతం చేసుకోవాలనే విపరీత తపనతో కొంత విజయాన్ని, మరికొంత ఓటమిని పొందడం జరుగుతుంది. ఈ ఆరాట పోరాటంలో ఎన్నో మోసాలు, కుతంత్రములు, హత్యలు, దోపిడీలు లాంటి పద్ధతులు. చివరికి తిరిగి చూస్తే భగవంతుడు తల్లిగర్భంలో మనిషికి అత్యంత విలువగా ప్రసాదించిన 'కాలం' అనేది పూర్తిగా కరిగిపోయి వార్ధక్యం అనే ఎండుగడ్డి జీవిత సౌధంలో ఉంటున్నాడు. ఈ ఎండుగడ్డి జీవితం అతనికి గాని సాటివారికి గాని ఎందుకు పనికిరాని కర్మ జీవితం. ఆ తుదుపరి వట్టి చేతులలోను, వట్టి కాళ్ళతోను వెళ్ళిపోతున్నాడు. ఈ భూమిపైకి ఎందుకు వస్తున్నాడు ఎందుకు పోతున్నాడో అర్థం చేసుకొనే లోపల అత్యంత విలువైన జీవితకాలం మాయమైపోతుంది. ఈ 'మాయ' అనేది కల్గడానికి మనిషిలో అజ్ఞానం కారణం. ఈ అజ్ఞానం అనేది ధనాశ, అధికార ఆశ, స్త్రీ వ్యసనపు ఆశలు వలన ఏర్పడి విలువైన మానవజీవితం బుగ్గిపాలైపోతుంది. అదేవిధంగా ఎవరూ తనతోపాటే జన్మించి తనతోపాటే తిరిగివెళ్ళరు. మరలా మరో జన్మలో ఈ యిద్దరు కలసి ఒకటిగా జన్మించి ఒకటిగా జీవించి ఒకటిగా తిరిగి వెళ్ళరు. ఏ జన్మ ఋణం ఆ జన్మబంధమే తప్ప ఆ ఋణంలో జన్మజన్మల బంధం ఏర్పడటం లేదు. అంటే 'బంధం' అంతా ఋణంతో ఏర్పడి ఋణం తీరటంతో పోతుంది. ఈ మాయా బంధ ఋణాలు పంచభూత నిర్మితమైన దేహం ఉన్నంత వరకే ఆ తదుపరి ఎవరి దారి వారిది. ఈ మాయా ఋణ బంధాలు మనిషిని అనేక మార్గాలలోకి ప్రేరేపిస్తుంటాయి. ఇది మాయతోకూడిన ఋణ తీపిగుర్తులు.

నువ్వులేకపోతే నేను జీవించి ఉండను, ఉండలేననే మాట 'మాయ' మాట. ఏ ఒక్కరి లేమి వలన ఈ సృష్టి ఆగదు. ఈ జీవనకార్యం కొనసాగడానికి పరస్పర మాయ ఆకర్షణ తప్ప వేరు కాదు. దైవం తనదైన కార్యం నెరవేర్చడానికి ప్రతి ఒక్క జీవరాశిని తనదైన పద్ధతిలో ఉపయోగించుకొనుచున్నాడు. ప్రతి ఒక్క జీవరాశికి ఈ సృష్టికార్యంలో తనదైన పాత్ర ఉంటుంది. అందుచేతనే చేయించేవాడు చేసేవాడు అంతా సర్వేశ్వరుడు మనిషి కేవలం నిమిత్తమాత్రుడే తప్ప వేరుకాదు. కాని మనిషి తనదైన మానవ ధర్మాలను అతిక్రమించకుండా జీవనం కొనసాగిస్తే దుఃఖం, బాధ, కామం, అతనికి దూరంగానే ఉంటాయి. ఈ సమస్త సృష్టికి మూలం 'ధర్మం' . దీని ఆధారంగానే ఈ సృష్టి కొనసాగుచున్నది. దీనిని అతిక్రమించిన మనిషి త్వరితకాలంలో దుఃఖ కర్మని పొందక తప్పదు. తృప్తిగా జీవన కార్యం ముగించుకొనే వ్యక్తి పరమాత్మ సన్నిధికి చేరడం లేదా ఉత్తమ లోకాలకు వెళ్ళడం తప్పక జరుగుచున్నది.

**– పి. గిరిరాజు సిద్ధాంతి**

Click here to get your free novaPDF Lite registration key